సాక్షి సిద్దిపేట

శనివారం, 15, జూలై, 2023



బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామశివారులో ఆర్టీసీ బస్సును ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 8లో



తప్పుడు మెసేజ్‌లతో మోసపోవద్దు

సైబర్ నేరగాళ్లు ఫోన్‌కు పంపే ఫార్వర్డ్ మెసేజ్‌ను చూసి మోసపోవద్దని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. 8లో

పాస్ఫరస్ బ్యాక్టీరియాతో లాభాలు

చేర్యాల(సిద్దిపేట): పాస్ఫరస్ బ్యాక్టీరియా ఎరువు వాడకం వల్ల లాభాలు ఉన్నాయని ఏడీఏ రాధిక అన్నారు. శుక్రవారం చేర్యాలలోని గడ్డి జీరయ్య పొలం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఎరువు వాడటం వల్ల భాస్వరంకు అయ్యే ఖర్చును తగ్గించవచ్చని తెలిపారు. భూమిలో భాస్వరాన్ని త్వరగా కరిగించి పంటకు అందే విధంగా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రవళి, రైతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బస్సుపాస్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్, చిలాపూర్ పల్లె మోడల్ స్కూల్ విద్యార్థులకు బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కరీంనగర్–1 డిపో అధికారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆన్‌లైన్లో బస్‌పాస్ రూట్ మ్యాప్‌లో ఈ గ్రామాలు లేనందున విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, డీవీ రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లీన్ సిటీగా మారుద్దాం

సిద్దిపేటజోన్: ప్రజల భాగస్వామ్యంతో క్లీన్ సిటీగా సిద్దిపేటను మారుద్దామని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. శుక్రవారం స్థానిక 27వ వార్డులో మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, పాలకవర్గ సభ్యులతో కలిసి ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుమల్‌రెడ్డి, లక్ష్మణ్, సుందర్, మోహిజ్, నాగరాజు, మల్లికార్జున్, రఘురాం, అరవింద్, మహేందర్, సురేష్, యోగి, రాజు, సాయి, విజేందర్, శ్రీహరి పాల్గొన్నారు.

అందుబాటులో కార్యాలయం ఏర్పాటు చేయండి



వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్ : డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడానికి ఇబ్బంది లేకుండా దుబ్బాకలో తాత్కాలిక రవాణా కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తన సొంత ఖర్చులతో అందజేస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం 12 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వారందరూ సిద్దిపేట ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లడం దూర భారం అవుతుందని, దుబ్బాకలో లైసెన్సులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఈ విషయంపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి గుంతలు పడిన ప్రాంతంలో తాత్కాలికంగా డస్ట్ పోయించారు.

కార్మికులకు కనీస వేతనం అందించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చినా కార్మికుల జీతాలు మాత్రం పెరగలేదన్నారు. 2021లో కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించి ఐదు రకాల జీవోలు, నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ నేటి వరకు గెజిట్ జారీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో దాసరి కళావతి, బండ్ల స్వామి, చొప్పరి రవికుమార్, ఇప్పకాయల శోభ, వేణుగోపాల్, రంగారెడ్డి, పాల్గొన్నారు.

ఇంకా ఇయ్యలే!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందని పాఠ్యపుస్తకాలు
- ప్రశ్నార్థకంగా ఇంటర్ విద్య
- గతేడాది విద్యార్థుల పుస్తకాలతో కొందరికి సర్దుబాటు
- బహిరంగ మార్కెట్‌లో కొనలేని పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న స్టూడెంట్స్



తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాల

సాక్షి, సిద్దిపేట: విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులైనా పాఠ్య పుస్తకాలివ్వకపోవడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠాలు మొదలైనా పుస్తకాలు లేక చదువులు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అందించాల్సి ఉన్నా ఇప్పటికీ అందించలేదు. పుస్తకాలు ఆలస్యంగా అందించడంతో విద్యార్థుల ఉత్తీర్ణత పై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

20 కళాశాలలు... 5,474 విద్యార్థులు

- జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో 5,474 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో మొదటి సంవత్సరం 2,668, ద్వితీయ సంవత్సరం 2,806 మంది వివిధ గ్రూపుల్లో చదువుతున్నారు.
- గతేడాది ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థుల నుంచి అధ్యాపకులు పాఠ్య పుస్తకాలను సేకరించి కొందరికి అందించారు. ఇలా కొన్ని చోట్ల గ్రూప్ రెండు నుంచి మూడు సెట్‌ల పుస్తకాలను సేకరించి ఒక్కొక్కరికి ఒక్కో సబ్జెక్ట్ పుస్తకాలను అందించి మారుస్తున్నారు. –అధ్యాపకులు పాఠాలు బోధించిన తర్వాత ఇంటి వద్ద చదువుకునేందుకు పుస్తకాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బుక్స్ పంపిణీ చేయకపోవడంతో సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం లేకుండా పోతుందని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ సిలబస్ త్వరగా పూర్తయితే ఎంసెట్ లాంటి పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి సమయం కలిసివస్తుంది. పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఎంసెట్‌కు ప్రిపేర్ అవడం కష్టంగా మారుతుంది.
- బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసే స్థోమతలేని చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యాన్ని గుర్తించిన వ్యాపారులు అధిక ధర చెబుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫలితాల పై ప్రభావం

- పుస్తకాల ఆలస్యంతో ఫలితాల పై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. 2022–2023 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 56శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది సైతం పుస్తకాలు ఆలస్యంగా రావడంతో ఫలితాలపై ప్రభావం పడింది. అదే పదో తరగతిలో 99శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నా.. ఇంటర్‌కు వచ్చే సరికి ఉత్తీర్ణత శాతం తగ్గిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా పాఠ్య పుస్తకాలు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పాఠ్య పుస్తకాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. మా క్లాస్‌లో 40 మంది విద్యార్థులు ఉంటే మూడు సెట్‌ల పాత పుస్తకాలు ఇచ్చారు. ఒక్కొక్కరికి ఒక్కో సబ్జెక్ట్ పుస్తకం అందించారు. కొందరికి ఏ పుస్తకం ఇవ్వలేదు. వాటినే అందరం మార్చుకుంటూ చదుకోవాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి పాఠ్య పుస్తకాలు త్వరగా అందించాలి. – అభిరామ్, హెచ్ఈసీ, ద్వితీయ సంవత్సరం, తొగుట

కొన్నిచోట్ల పాతవి సర్దుబాటు చేశాం



ఈ సంవత్సరం కొత్త పాఠ్య పుస్తకాలు ఇంకా రాలేదు. ఇండెంట్‌ను పంపించాం. కొన్ని చోట్ల పాత పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు సర్దుబాటు చేస్తున్నాం. కొత్తవి రాగానే వెంటనే విద్యార్థులకు అందజేస్తాం. –సూర్యప్రకాశ్, డీఐఈఓ

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులు, ఫంక్షనల్, వర్టికల్ విధులపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 2021–22 సంవత్సరంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత ఏసీపీ, సీఐలు, పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ గురించి ఎస్ఐలకు గైడ్ చేయాలని సూచించారు. పెండింగ్ కేసులలో కోర్టు అధికారులతో మానిటర్ చేసి సీసీ నెంబర్లు వెంటనే తీసుకోవాలని అన్నారు. పోలీసు స్టేషన్ల చుట్టూ పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని, 5ఎస్ ఇంప్లిమెంటేషన్ చేయాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని అన్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ అధికారులు లాడ్జీలు, పాత నేరస్థులను తనిఖీ చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి, గంజాయి, మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించడానికి పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, హుస్నాబాద్ సీఐ కిరణ్, సీసీఆర్బీ సీఐ గురుస్వామి, హుస్నాబాద్ డివిజన్ ఎస్ఐలు మహేష్, నరేందర్ రెడ్డి, వివేక్, భాస్కర్‌రెడ్డి, నారాయణ, ఐటీకోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికలు



పోటీలు నిర్వహిస్తున్న పీఈటీ

సిద్దిపేటజోన్: భారత క్రీడా సమాఖ్య, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికలు నిర్వహించారు. నాలుగు, ఐదవ తరగతి చదువుతున్న క్రీడాకారులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తరగతులకు సంబంధించి 40మంది బాల బాలికలను ఎంపిక చేశారు. ఈనెల 24న హకీంపేట క్రీడా పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాల ఎంపికల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపిక ప్రక్రియ జిల్లా క్రీడా, యువజన సంక్షేమ అధికారి నాగేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు .

సమాజంలో అందరూ సమానమే

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి



తిమ్మాపూర్‌లో సహపంక్తి భోజనాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సమాజంలో అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై, పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో దళితుల పట్ల కుల వివక్ష ఘటన నేపథ్యంలో శుక్రవారం పౌర హక్కులపై అవగాహన, సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కాలంలో అంటరానితనం పాటించడం బాధాకరమన్నారు. అందరూ సమష్టిగా జీవించాలని సూచించారు. గ్రామాల్లో కుల వివక్షత పాటించవద్దని, కులమతాల భేదాలు లేకుండా ఐక్యంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ రమేష్, తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణమూర్తి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీటీమ్స్

గజ్వేల్ ఏసీపీ రమేశ్



వర్గల్ గురుకులంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

వర్గల్(గజ్వేల్): మహిళల భద్రత కోసం షీటీమ్స్ పనిచేస్తున్నాయని, క్యూఆర్ కోడ్ ద్వారా బాధిత మహిళలు ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చని గజ్వేల్ ఏసీపీ రమేశ్ అన్నారు. శుక్రవారం వర్గల్ జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో మహిళలు, బాలికల రక్షణ చట్టాలు, షీటీమ్స్, సైబర్‌నేరాలు తదితర అంశాలపై పోలీసు శాఖ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో షీటీమ్‌కు ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసేందుకు వీలుగా జిల్లాలోని ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లు, సినిమాహాల్స్, స్కూల్స్, కళాశాలలు తదితర ప్రాంతాలలో క్యూఆర్ కోడ్‌స్కానింగ్ పోస్టర్లు అతికించి ఉన్నాయన్నారు. ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు పోస్టర్ మీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌తో స్కాన్ చేయగానే క్యూఆర్.టీఎస్‌పోలీస్.గవ్.ఇన్ అనే లింక్ వస్తుందని, లింక్‌ను క్లిక్ చేయగానే ఫిర్యాదు ఫోరం ఓపెన్ అవుతుంది. అందులో పేరు, లొకేషన్ తదితర వివరాలను పూరించి సబ్మిట్ చేయగానే జిల్లా పోలీస్ కార్యాలయంలోని షీటీమ్ సాఫ్ట్‌వేర్ ఐటీ విభాగానికి చేరుతుంది. వెంటనే లొకేషన్‌కు దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం చేరి అలర్ట్ అవుతారన్నారు. వేధింపుల సమస్య ఉత్పన్నమైనపుడు వెంటనే 100, 112, 1098, షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 9440700906, 040–27852246 ఫోన్ చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా ఫేస్‌బుక్, ఎస్‌డీపీటీషీటీమ్, ఎస్‌డీపీటీషీటీమ్ జీమెయిల్.కామ్ ద్వారా సమాచారం అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, గౌరారం ఎస్‌హెచ్ఓ సంపత్, ఏఎస్ఐ రుక్కమ్మ, షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ అమృత్, హెచ్‌సీ సంజీవ రెడ్డి, పీసీ యుగంధర్, అన్వేష్, జ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్‌గా గరిమా అగర్వాల్

పెద్దపల్లి కలెక్టర్‌గా ముజామ్మిల్ ఖాన్



గరిమా అగర్వాల్



ముజామ్మిల్ ఖాన్

సాక్షి, సిద్దిపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమించారు. ఈమె 2018లో సివిల్స్‌లో 40వ ర్యాంక్ సాధించారు. అంతకంటే ముందు 2017లో సివిల్స్‌లో 241 ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణ సైతం పొందారు. ట్రెనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా యాదాద్రి భువనగిరిలో పనిచేశారు. అక్కడి నుంచి కరీంనగర్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల)గా బదిలీ అయ్యారు. ప్రస్తుత బదిలీల్లో కరీంనగర్ నుంచి సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

పెద్దపల్లి కలెక్టర్‌గా..

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ ఉన్న ముజామ్మిల్ ఖాన్‌ను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. మూడేళ్లుగా జిల్లా అదనపు కలెక్టర్‌గా సేవలందించారు. స్థానిక సంస్థల బలోపేతానికి, పట్టణ ప్రజలకు మున్సిపాలిటీల ద్వారా సేవలు మరింత మెరుగుగా అందేందుకు తన వంతు కృషి చేశారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకింగ్‌లను సాధించేందుకు తన వంతు కృషి చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జిల్లా ఓడీఎఫ్ ప్లస్ సాధించడంలో తనదైన మార్క్‌ను వేశారు. అలాగే జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుతుప్రేమ కార్యక్రమంలో పాల్గొని మహిళలు అనారోగ్యం బారిన పడకుండా సూచనలు చేశారు.

సివిల్స్–2016లో తెలంగాణ టాపర్

2014 సంవత్సరంలో ముజామ్మిల్ ఖాన్ తొలి సారిగా సివిల్స్ రాస్తే ఐఆర్‌టీఎస్ వచ్చింది. శిక్షణ పూర్తయ్యాక ఏసీఎంగా కొలువు దక్కింది. అక్కడ పనిచేస్తూనే 2015లో మళ్లీ సివిల్స్ రాయగా ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యాడు. అందులో చేరకుండా పాత ఉద్యోగంలోనే కొనసాగుతూ మూడోసారి 2016లో సివిల్స్ రాయగా జాతీయ స్థాయిలో 22, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించాడు. ఐఏఎస్ శిక్షణ పూర్తి చేశాక 2018లో వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్, హుస్నాబాద్ డిప్యూటీ కలెక్టర్ పని చేశారు. ఫిబ్రవరి 2020లో సిద్దిపేట జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శుక్రవారం పెద్దపల్లి కలెక్టర్‌గా ప్రమోషన్ పొంది బదిలీపై వెళ్లారు.

పకడ్బందీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: జిల్లాలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులకు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి అసెంబ్లీకి జరగబోయే సాధారణ ఎన్నికలపై అవగాహన, ఈవీఎం లు, వీవీ ప్యాట్‌ల ఉపయోగం కోసం డిజిటల్ ఔట్రీచ్ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండవ విడత ఓటర్ జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల ముందు, మనకు వచ్చిన ప్రతి దరఖాస్తు స్క్రూటినీ పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరణ పూర్తి చేయాలని అన్నారు. ఇంటికి ఆరు కంటే అధికంగా ఉన్న ఓటర్ల వివరాల ధ్రువీకరణను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా ఓటరు డ్రాఫ్ట్ జాబితా రూపొందిస్తామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ యంత్రాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



కాల్వ నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న ఎంపీ

రాయపోలు(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంకిరెడ్డిపల్లిలో ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని ప్రారంభించారు. అదేవిధంగా రాంసాగర్‌లో గౌడసంఘం , ముదిరాజ్ సంఘం, గొల్లపల్లి, రామారంలో పలు కులసంఘ భవనాలు, సయ్యద్‌నగర్‌లో ఈద్గా నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు వీరానగర్ శివారులో నిర్మాణంలో ఉన్న మల్లన్నసాగర్ కాల్వ పనులను పరిశీలించారు. వడ్డేపల్లి సర్పంచ్ బచ్చ చంద్రశేఖర్ సూచన మేరకు వీరానగర్ వద్ద మరో 60మీటర్ల కాల్వ నిర్మిస్తే ఈ ప్రాంతంలోని చెరువులకు నీరు వస్తుందని, పరిశీలించాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట సర్పంచులు వెంకటనర్సింహారెడ్డి, సంధ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, ఏఓ నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పడకంటి శ్రీనివాస్‌గుప్త, రైతుబంధు అధ్యక్షుడు రేకుల నర్సింహారెడ్డి, రణం శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వరశర్మ, రాజిరెడ్డి, దయాకర్, కల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సేవలు అభినందనీయం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



బాపు డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉభయ తెలుగు రాష్ట్రాలలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ సంస్థల ఆధ్వర్యంలో బాపు డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విద్య, సామాజిక రంగాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ రెండు సంస్థలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి, సంస్థల సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా ప్రతినిధులు సికిందర్, భగవాన్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి బదిలీ

నూతన ఆర్డీఓగా బన్సీలాల్ నియామకం



విజయేందర్‌రెడ్డి

గజ్వేల్: సుదీర్ఘ కాలం పాటు గజ్వేల్‌లో ఆర్డీఓగా సేవలందించి ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన విజయేందర్‌రెడ్డి తాజాగా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బదిలీ ఆదేశాలు వెలువడ్డాయి. గజ్వేల్ అభివృద్ధిలో ఆర్డీఓ తనదైన ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూసేకరణతో పాటు నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీల పంపిణీ ఇతర సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో మరిన్ని కీలకమైన అభివృద్ధి పనులకు అవసరమైన భూములను సేకరించగలిగారు. గతంలో ఈయన గజ్వేల్ డిప్యూటీ తహసీల్దార్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. విజయేందర్‌రెడ్డి స్థానంలో బన్సీలాల్‌ను ఆర్డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు, రేపు వర్గల్‌లో తెలంగాణ విద్వత్‌సభ

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలోని కంచి శంకరమఠం వేదికగా శని, ఆదివారాలలో తెలంగాణ విద్వత్‌సభ (సమ్మేళనం) నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విద్వత్‌సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి తెలిపారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి జ్యోతిష్య పండితులు, సిద్ధాంతులు హాజరవుతారని పేర్కొన్నారు. రాబోయే శ్రీక్రోధి నామ సంవత్సరంలో పండగలు, ముహూర్తాల నిర్ణయం కోసం సమ్మేళనంలో విద్వత్‌గోష్ఠి జరుగుతుందని వివరించారు. అనంతరం ఏకాభిప్రాయంతో తేదీలు ఖరారు చేస్తారన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి వేదస్వస్తి, కొడకండ్ల రాధాకృష్ణశర్మ సంకీర్తన, 9 గంటలకు ముఖ్యఅతిథి జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

క్లుప్తంగా

నిందితుడికి రిమాండ్



సాక్షులను విచారిస్తున్న సీఐ, ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): తండ్రిపై దాడి చేసి అతని మరణానికి కారణమైన కొడుకును రిమాండ్‌కు తరలించారు. భూమి కౌలు విషయమై గట్లమల్యాలలో ఎర్రవెల్లి రాజయ్యపై అతని కుమారుడు ఎర్రవెల్లి రవి దాడి చేయడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. అనంతరం రవిని రిమాండ్‌కు తరలించామని వారు తెలిపారు.

వెజ్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న దుకాణాలు

సిద్దిపేటజోన్: స్థానిక ఇంటిగ్రేటెడ్ వెజ్ మార్కెట్‌లో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. కూరగాయలను విక్రయించే బ్లాక్‌లో రెండు దుకాణాలు దగ్ధం అయ్యాయి. మంటలను సకాలంలో సిబ్బంది ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, సెక్రటరీ వెంకటయ్యలు అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20వేల కూరగాయలు దగ్ధం అయినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా దుర్గమ్మ జాతర



సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో జరిగిన దుర్గమ్మ జాతర మహోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల రెడ్డి, తోపాజీ అనంత కిషన్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సదాశివపేట రూరల్ నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో జరిగిన ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డుపై ఆర్టీసీ బస్సు లారీని ఢీ కొని డ్రైవర్‌తో సహా ఆరుగురికి గాయాలయ్యాయి.



న్యాల్‌కల్: బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సును ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. హద్నూర్ ఎస్‌ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం..కర్నాటక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తుంది. న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామ శివారులో జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆల్టోకారు రాంగ్ రూట్లో వచ్చి బస్సును ఢీ కొంది. కారును అతి వేగంగా నడపడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు డ్రైవర్ సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా అంగారాజీపల్లి గ్రామానికి చెందిన వాడు. మరో వ్యక్తి వెంకటేశ్వర్ రాజ్ గుంటూర్ జిల్లాకు చెందిన వాడని ఎస్‌ఐ తెలిపారు. తీవ్ర గాయాలైన వెంకటేశ్వర్‌రాజును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బస్సు కండక్టర్ శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రఘు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సదాశివపేట రూరల్‌లో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న మినీ అంబులెన్స్ నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోకి రాగానే అదుపు తప్పింది. పార్కు చేసిన ఇన్నోవా వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్ సర్జీరావు భారటే(45)స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో ఆయన్ను మరో అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డుపై చోటు చేసుకుంది. జీపీపీ ఆర్టీసీ డిపో సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు 25మంది ప్రయాణీకులతో జేబీఎస్‌కు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారు జామున ప్రజ్ఞాపూర్ సమీపంలో రింగురోడ్డు మీదుగా వెళ్తున్న క్రమంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రాజ్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గుండెపోటుతో ఇద్దరి మృతి

వడ్డేపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందగా, కొండపాక విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పూస బాల కిషన్ గుండెపోటుకు గురై మృతి చెందారు.

రాయపోలు(దుబ్బాక): వడ్డేపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..సూర్యాపేట జిల్లా లింగాల గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరెడ్డి (54) వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇక్కడ 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి గజ్వేల్‌లో నివాసముంటున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం పాఠశాలకు వెళ్లొచ్చిన ఆయన రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృతితో వడ్డేపల్లి పాఠశాలలో విషాదం నెలకొంది.



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

గుండెపోటుతో వాచ్‌మెన్..

కొండపాక(గజ్వేల్): 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న పూస బాలకిషన్(36) గుండెపోటుతో మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన బాలకిషన్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. దినచర్యలో భాగంగా గురువారం డ్యూటీ చేస్తుండగా శుక్రవారం ఉదయం నిద్రలేవలేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ పుష్పరాజ్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని శివసాయి నగర్ కాలని సమీపంలోని దినేష్ హోమ్స్ ప్రక్కన నాలాలో ఒక గుర్తు తెలియని మహిళా మృతదేహం శుక్రవారం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలి ఎడమ చేతిపై ×మధు, అంజి, అమ్మ౯ అనే పచ్చబొట్టును గుర్తించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలి చేతిపై మధు, అంజి, అమ్మ అని పచ్చబొట్టు

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

పాపన్నపేట(మెదక్): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ముద్దాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సంగన్న కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కురుమ యాదగిరి (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పొలం వద్ద జారి పడగా కాలు విరిగింది. ఆరు నెలల క్రితం బైక్‌పై నుంచి పడి కాలు విరిగింది. అప్పటి నుంచి సరిగా నడవ లేక పోతున్నాడు. దీంతో పొలం పనులు చేసుకోలేక తరచూ బాధ పడుతుండే వాడు. ఈ నెల 8న పొలానికి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి రాలేదు. దీంతో అతని భార్య పొలం వద్దకు వెళ్లి చూడగా యాదగిరి పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. వెంటనే అతన్ని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



యాదగిరి (ఫైల్)

మైనర్లను పనిలో పెట్టుకోవద్దు

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్

కోహీర్(జహీరాబాద్): మైనర్లను పనిలో పెట్టుకోవద్దని జహీరాబాద్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ నర్సిములు సీడబ్ల్యుఎస్సీ సభ్యులు శ్రావణ్‌కుమార్‌తో కలిసి కోహీర్ పట్టణంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుకాణాలు, హోటళ్లు, వ్యాపారసంస్థలలో తనిఖీలు నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. వారిని పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి వందశాతం అక్షరాస్యత సాధించడానికి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కోహీర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బాలకార్మికుడిని బడిలో చేర్పించిన అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): బడిమానేసిన బాలకార్మికుడిని గుర్తించి మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం చేర్పించామని ఎంఈఓ అంజయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..కొండాపూర్ మండలంలోని ఆదర్శ జిమ్యాక్స్ కాలనీలో నివాసం ఉంటూ చెత్త సేకరిస్తూ కనిపించడంతో అతని వివరాలు తెలుసుకొని ఇంటికి వెళ్లి తల్లి ముంతాజ్‌కు చదువు విలువ గురించి వివరించి ఒప్పించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మెహరాజ్‌లు, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాకేశ్, సీఆర్పీ రాజేశ్వర్ తదితరులు సహకరించారని ఎంఈఓ అంజయ్య తెలిపారు.



తల్లి ముంతాజ్‌కు నచ్చచెబుతున్న ఎంఈఓ దండు అంజయ్య

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

మెదక్‌జోన్: కుక్కల దాడిలో నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఔరంగాబాద్ తండాలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఔరంగాబాద్ తండాకు చెందిన మాలోత్ శ్రీను రోజూమాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి రాత్రి కొట్టంలో కట్టివేశాడు. తెల్లారి చూసే సరికి కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి నాలుగు గొర్రెలను చంపేసినట్లు బాధితుడు శ్రీను తెలిపారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు. సంఘటనా స్థలాన్ని వెటర్నరీ అధికారి లక్ష్మణ్ సందర్శించారు.

నిందితుడికి యావజ్జీవ శిక్ష

చేగుంట(తూప్రాన్): వరకట్న వేధింపుల కారణంగా భార్య మృతికి కారణమైన భర్తకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. 2017లో మక్కరాజీపేట గ్రామంలో అగల్‌దివిటి మానస(24) వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు మానస భర్త విక్రమ్‌జీ పై చేగుంట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ రాంగోపాల్ రావు విచారణ చేసి నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో వాదనలు విన్న జడ్జి లక్ష్మీశారద నిందితుడు విక్రమ్‌జీ నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి సాక్షులను ప్రవేశ పెట్టగా ప్రభుత్వ న్యాయవాది ఫైజల్‌అహ్మద్ వాదనలు వినిపించారు. కేసు విచారణకు చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్, కానిస్టేబుల్ లక్ష్మీపతి తూప్రాన్ డీఎస్పీకి సహాయకులుగా పనిచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి అదృశ్యం

కోహీర్(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కొత్తగొల్ల తుక్కప్ప, భార్య ఈశ్వరమ్మ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో కలిసి 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌కు వెళ్లారు. ఈశ్వరమ్మ, శ్రీనివాస్ తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. తుక్కప్ప మాత్రం కనిపించకుండా పోయాడు. తుక్కప్ప కోసం బంధుమిత్రుల వద్ద, తెలిసిన వారి వద్ద ఎంత వెతికినా అతని ఆచూకీ లభించలేదు. తుక్కప్ప అదృశ్యం వెనుక భార్య ఈశ్వరమ్మ, శ్రీనివాస్ హస్తం ఉందని తుక్కప్ప తమ్ముడు విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన సీఐ లక్ష్మీబాబు

రామాయంపేట(మెదక్): 35కు పైగా చోరీ కేసులతో సంబంధం ఉన్న అంతర్ రాష్ట్ర నేరస్తుడిని అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం ..నార్సింగి మండలం కాస్లాపూర్‌కు చెందిన బాలమణి గత నెల 25న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుంది. అక్కడే మాటువేసి ఉన్న నిందితుడు మరొకరితో కలిసి ఇనుపరాడ్డుతో తలపై కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని పారిపోయాడు. తూప్రాన్ మండలం హైదర్‌గూడ గ్రామానికి చెందిన ఓ మహిళ పుస్తెలతాడు అపహరించిన కేసులో ఇతడే ప్రధాన నిందితుడని సీఐ పేర్కొన్నారు. నిందితుడు బల్జీత్‌సింగ్ సంకాపూర్ స్టేజీవద్ద ఉండగా అతన్ని అరెస్ట్ చేసి విచారించారు. ఈ విచారణలో తను గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన బల్జీత్‌సింగ్‌కు కర్ణాటకలో, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పలు కేసులతో సంబంధం ఉందని సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బాలాజీసింగ్, శంశేర్‌సింగ్‌ల కోసం గాలిస్తున్నామని సీఐ పేర్కొన్నారు. ఈ కేసులను చాకచక్యంగా చేధించిన సీఐ లక్ష్మీబాబు, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట ఎస్‌ఐలు నర్సింలు, శ్రీనివాసరెడ్డి, ఎస్‌హెచ్‌వో సురేశ్‌కుమార్, కానిస్టేబుళ్లు భాస్కర్, నాగభూషణం, కుమార్, ఖాజా జహంగీర్, యాదగిరి, కృష్ణ, సూర్యప్రకాశ్‌ను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అభినందించి రివార్డులు అం



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీబాబు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- సికింద్రాబాద్ నుంచి నాందేడ్‌కు తరలిస్తున్న వైనం
- లారీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న 209 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు, సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులోని రిమ్, జిమ్ దాబా వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ దినేష్ పోలేను అదుపులో తీసుకున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి నాందేడ్‌కు తరలిస్తున్న దాదాపు 209 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని పటాన్‌చెరు పౌరస రఫరాల గోదాంకు తరలించారు. డీటీసీఎస్‌లు విష్ణు వర్ధన్, దినేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లారీని సీజ్ చేసిన అధికారులు

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

కంది(సంగారెడ్డి): కంది మండలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మామిడిపల్లి, ఏర్దనూర్ ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు శుక్రవారం ఛిద్రుప్పశివారులోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించారు. గ్రామ శివారులోని సర్వేనంబర్లు 116, 117లలో అసైన్డ్ భూమిలో నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి నిర్మాణాలకైనా సరే హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న పంచాయతీ అధికారులు

గ్రానైట్ లారీ బోల్తా

తొగుట(దుబ్బాక): గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట నుంచి గజ్వేల్‌కు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీకి ఎదురుగా మరోక వాహనం రావడంతో లారీని ప్రక్కకు తప్పించబోయేక్రమంలో అదుపుతప్పింది. దీంతో పంట పొలంలోకి దూసుకుపోయి పల్టీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు.



పొలంలో బోల్తాపడిన గ్రానైట్ లారీ

తప్పుడు మెసేజ్‌లతో మోసపోవద్దు

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరగాళ్లు రోజుకో విధంగా మోసం చేస్తున్నారు. ఫోన్‌కు వచ్చే ఫార్వర్డ్ మెసేజ్‌ను చూసి మోసపోవద్దని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పింక్ వాట్సప్‌కు వచ్చే ఫార్వర్డ్ మెసేజ్ నమ్మి మోసపోవద్దన్నారు. ఆ లింక్‌ని క్లిక్ చేసి యాప్ ఇన్స్టాల్ చేస్తే మీ ఫోన్‌లో పూర్తి డాటా ఫొటోస్, కాంటాక్ట్స్, బ్యాంకింగ్ డిటెయిల్స్ ఓటీపీ, సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతాయన్నారు. మిలియన్ల మంది వినియోగదారులతో, దేశంలో అత్యధికంగా ఉపయోగించే మెసేజింగ్ ప్లాట్‌ఫాంలలో వాట్సాప్ ఒకటి అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా పింక్ వాట్సాప్ పేరుతో ఓ లింక్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని పేర్కొన్నారు. పింక్ వాట్సాప్ లింక్‌ను క్లిక్ చేస్తే మీ ఫోన్‌లో ఉన్న సమాచారమంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. అదే విధంగా మీ బ్యాంకు ఖాతాల, సోషల్ మీడియా అకౌంట్ల పాస్‌వర్డ్‌లను మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి ఫోన్‌లకు వచ్చే ఎటువంటి మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు.



పింక్ వాట్సాప్‌కు సంబంధించిన లింకులు

హత్యాయత్న నిందితుడి రిమాండ్

సదాశివపేట(సంగారెడ్డి): పేకాట ఆడుతున్నాడనే విషయాన్ని పోలీసులకు చెప్పాడనే కోపంతో ఓ వ్యక్తిని చంపేందుకు ప్రయత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 6న పట్టణంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో సమీయుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన సలిమాబి కుమారుడు సాజిద్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల13న తెల్లవారుజామున 4 గంటలకు సిద్దాపూర్ కాలనీయందు సాజిద్‌ను హత్యచేసేందుకు మటన్ కోసే కత్తితో దాడి చేశాడని దీంతో అతను తప్పించుకున్నాడు. ఈ క్రమంలోనే 14తేదీన ఉదయం సాజిద్‌ను చంపడానికి సమీయుద్దిన్ ఇంటి నుంచి పల్సర్‌బైక్‌లో మటన్ కోసే కత్తిని పెట్టుకుని వస్తుండగా పోలీసులు అతణ్ని పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితుడు పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడని సీఐ పేర్కొన్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు

చైన్ స్నాచింగ్ నియంత్రణకు సహకరించాలి

మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చైన్ స్నాచింగ్ నియంత్రణకు ప్రతీ ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి కోరారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలో చైన్‌స్నాచింగ్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మార్కెట్‌కు, ఒంటరిగా భయటకు వెళ్లే సమయంలో ఎక్కువగా బంగారు ఆభరణాలను ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు మెడలోని బంగారు ఆభరణాలు కనిపించకుండా కొంగు కప్పుకోవాలని పేర్కొన్నారు. కొంత మంది దుండగులు అడ్రస్ అడిగినట్లు నటిస్తూ బంగారు ఆభరణాలను తెంచుకొని పారిపోతున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ ఏసీపీ పి.నరసింహారావు, ఎస్‌ఐ శశికాంత్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ శిల్పవల్లి